ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3, కనిష్ఠం 19.7



తెలుగు వికీపీడియా సదస్సుకు

ఆదివాసీ గిరిజనులకు ఆహ్వానం

ఉట్నూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి 16 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో జరిగే తెలుగు వికీపీడియా 21 వార్షికోత్సవ వేడుకలకు జిల్లాకు చెందిన ఆదివాసీ గిరిజనులకు ఆహ్వానం లభించిందని గిరిజనులు తెలిపారు. జిల్లాకు చెందిన వికీపీడియన్స్ ఆత్రంరాజ్‌కుమార్, సిడాం వర్‌ప్రసాద్, సిడాం కిరణ్‌కుమార్, ఆత్రంమోతిరామ్‌లు ఆహ్వానాలు అం దుకున్నారని బోలిచేతో ఫౌండేషన్ బోర్డు సభ్యులు ఆత్రం మోతిరామ్ తెలిపారు.



ఆదిలాబాద్ మార్కెట్ కార్యాలయం



పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు



తూకం వేస్తున్న దృశ్యం

సీసీఐ పత్తి కొనుగోళ్లలో.. గోల్‌మాల్!

- జిల్లాలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు కుమ్మక్కు
- తాత్కాలిక ధ్రువీకరణ పత్రాల జారీలో భారీ అవకతవకలు
- ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి మధుకర్‌పై సస్పెన్షన్ వేటు
- ఇచ్చోడ మార్కెట్ పరిధిలోనూ అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు
- అధికారుల అండతో బినామీ రైతుల పేరిట దళారుల ఇష్టారాజ్యం
- విజిలెన్స్ విచారణ జరిపించాలంటూ రైతు సంఘాల డిమాండ్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ పత్తి కొనుగోళ్లలో భారీ అక్రమాలు, అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంత మంది మార్కెట్ అధికారుల అండదండతో దళారులు అడ్డదారిలో సీసీఐకి పత్తిని విక్రయించినట్లు తెలుస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన రాష్ట్రస్థాయి అధికారులు మొత్తం 8 మంది మార్కెట్ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇందులో ఆదిలాబాద్ మార్కెట్ పరిధిలోనూ భారీ అవకతవకలు జరిగాయంటూ గుర్తించిన అధికారులు మార్కెట్ కార్యదర్శి మధుకర్‌పై సస్పెన్షన్ వేటు వేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మొదటి నుంచి సీసీఐ కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు వస్తున్నా అధికారులు తేలికగా తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో ఈ యేడు 4లక్షల 34వేల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యింది. దీంతో సుమారుగా 30 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. అక్టోబరులోనే సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఇప్పటి వరకు లక్షా 27వేల 859 రైతుల నుంచి 25 లక్షల 37వేల 598 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. అయితే సీసీఐ కొనుగోళ్లలో నిబంధనలు విధించడంతో రైతులకు పలు రకాల ఇబ్బందులు తలెత్తాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు కుమ్మక్కై అడ్డగోలుగా టీఆర్ పత్రాలను జారీ చేసి అందిన కాడికి దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యేడు జిల్లాలో సీసీఐ కొనుగోలు చేసిన పత్తి విక్రయాలపై క్షేత్రస్థాయిలో విజిలెన్స్ విచారణ జరిపిస్తే భారీ అక్రమాలు, అవకతవకలు బయటపడే అవకాశం ఉందంటున్నారు.



సస్పెన్షన్ ఉత్తర్వులు అందాయి

- గజానంద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఆదిలాబాద్

ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి మధుకర్‌ను సస్పెన్షన్ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. ఇప్పటికే మార్కెట్ కార్యదర్శికి సంబంధిత ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. పూర్తి స్థాయి విచారణ చేపట్టిన తర్వాత అవకతవకలు అక్రమాలపై వివరాలను వెల్లడిస్తాం.

నిబంధనలు గాలికి

రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని టీఆర్ పత్రాల జారీకి ప్రభుత్వం అనుమతించింది. దీంతో అధికారులు నిబంధనలను గాలికి వదిలేస్తూ టీఆర్ పత్రాలను జారీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. సీసీఐకి పత్తిని విక్రయించాలంటే భూ పట్టా పాస్‌బుక్‌తో పాటు ఆధార్ కార్డును రైతులు తప్పని సరిగా కలిగి ఉండాలని సీసీఐ నిబంధనలు విధించింది. అయితే కౌలు రైతులకు ఎలాంటి ఆధారం లేక పోవడంతో పంటలను అమ్ముకునేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలను జారీ చేశారు. అయితే అడ్డగోలుగా టీఆర్ పత్రాలను జారీ చేయడంతో అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం కౌలు రైతులు, పార్ట్ బీ భూములు, కోర్టు కేసులు, ఏజెన్సీలో గిరిజనేతరులు సాగు చేస్తున్న భూములకు మాత్రమే తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాల్సి ఉంది. కానీ రైతుల పేరిట కొంత మంది దళారులు టీఆర్ పత్రాలను తీసుకుని సీసీఐకి అడ్డదారిలో పత్తిని విక్రయించారన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని మండలాల్లో యజమానితో పాటు కౌలు రైతులకు పత్తిని విక్రయించేందుకు అధికారులు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. ఇలా అడ్డగోలుగా టీఆర్ పత్రాలను జారీ చేయడం వివాదాస్పదంగా మారుతోంది.

మార్కెటింగ్ శాఖలో కలకలం

ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి మధుకర్‌పై సస్పెన్షన్ వేటు వేయడంతో జిల్లా మార్కెటింగ్ శాఖలో కలకలం రేపుతోంది. ఏఈవోలు నిర్ధారించిన దానికంటే ఎక్కువగా చూపి పత్తిని అమ్మేందుకు అవకాశం కల్పించడంతో పాటు ఇతర జిల్లాలకు చెందిన టీఆర్‌పై ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తిని విక్రయించారన్న ప్రధాన ఆరోపణలతో ఆయనపై వేటు వేసినట్లు తెలుస్తోంది. అలాగే పత్తి కాంటాల మరమ్మతులు, ఇతర మేయింటనెన్స్ బిల్లుల్లోనూ భారీ అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. గతంలోనూ అక్రమంగా ప్రభుత్వ గోదాముల్లోనూ కందులను నిల్వ ఉంచేందుకు అవకాశం కల్పించిన అడెల్లుపై సస్పెన్షన్ వేటు పడింది. రాష్ట్రంలోనే అతి పెద్ద మార్కెట్‌గా పేరున్న ఆదిలాబాద్ మార్కెట్‌లో ప్రతీయేటా అక్రమాలు, అవకతవకలు జరుగడం పరిపాటిగానే మారింది. ఈ మార్కెట్‌లో పని చేసేందుకు కొందరు అధికారులు జోరుగా పైరవీలు చేస్తూ పోటీ పడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తూనే ఉంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే టీఆర్ పత్రాల జారీ

ఇచ్చోడ మార్కెట్ పరిధిలో భారీ అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మార్కెట్ పరిధిలో కొంత మంది వ్యవసాయ శాఖాధికారులు అడ్డగోలుగా టీఆర్ పత్రాలను జారీ చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి ఎంత విస్తీర్ణంలో రైతు పంటను సాగు చేశాడు, ఎంత దిగుబడి

(మిగతా 6వ పేజీలో)



విజిలెన్స్ విచారణ జరిపించాలి

- బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు

ఈ యేడు సీసీఐ కొనుగోళ్లలో భారీ అక్రమాలు, అవినీతి జరిగిందంటూ ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా అధికారులు తేలికగానే తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సీసీఐ కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయి. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించి దళారి దందాకు అడ్డుకట్ట వేయాలి. ఇచ్చోడ, ఇంద్రవెల్లి, బోథ్ మార్కెట్ పరిధిలోనూ అక్రమాలు జరిగాయి. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

ప్రత్యేక తరగతులను పరిశీలించిన ట్రైనీకలెక్టర్



మాట్లాడుతున్న ట్రైనికలెక్టర్ అభిజ్ఞాన్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలను బుధవారం ట్రైనీకలెక్టర్ అభిజ్ఞాన్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత సందర్శించారు. ఈ సం దర్భంగా పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు సాయంత్రం అల్పాహారంగా శనగలు అందజేయడం జరిగిందన్నారు. ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో మంచి మార్కులు తీసు కొని రావడానికి విద్యార్థులకు తగుసూచనలు ఇచ్చారు. అభ్యాస దీపి కలు, ఐఎఫ్‌పీ ప్యానెల్ ఉపయోగించి వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

సంప్రదాయాలను మరవద్దు : ఎమ్మెల్యే బొజ్జుపటేల్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా పూర్వీకుల నుంచి ఆచరిస్తూ వస్తున్న సంస్కృతి-సంప్రదాయాలను ప్రతిఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రధాన్‌సంఘం ఆధ్వర్యంలో పాత ఉట్నూర్‌లో నిర్వహించిన గోండిధర్మగురు హిరసుక జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా సంప్రదా యబద్ధంగా పూజలు నిర్వహించారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసుల సంస్కృతి సాంప్ర దాయాలను కాపాడడంలో హిరాసుక పాత్రకీలకమైందన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి సాంప్రదాయాలను అను సరించి భావితరాలకు అందజేయాలన్నారు. ఆదివాసీ ప్రధాన్ సమాజఅభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్‌జ నార్దన్, హిరాసుక జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పటేల్, దేవారి, మహిళలు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని హస్నాపూర్ హనుమాన్ ఆలయంలో ఈనెల 18 నుంచి 25 వరకు నిర్వహించనున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమ పోస్టర్లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ ఆవిష్కరించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే పోస్టర్లను విడుదల చేశారు. రాబోయే స్థానిక ఎన్నికలలో ప్రతి గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా కార్యకర్తలంతా కృషిచేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షల నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి సూచించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన ఎంఈఓ, హెచ్‌ఎం సమా వేశంలో ఆయన పాల్గొని పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి వారి ప్రతిభపై ఆరా తీయాలని ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలని ఆయన వివరించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాసర ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్పించండి

- కేంద్ర మంత్రికి ఆదిలాబాద్ ఎంపీ వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

బోథ్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని కేంద్రప్రభుత్వ ప్రసాద్ పథకంలో చేర్పించాలని ఆదిలాబాద్ జిల్లా ఎం పీ గోడం నగేష్ కేంద్ర మంత్రి గజేందర్ సింగ్ షేకావత్‌కు విన్నవించారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక ఆలయాన్ని పథకంలో చేర్పించినట్లయితే అన్నివిధాలుగా లాభదాయకంగా ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు. ఆయన వెంట మెదక్, చేవెళ్ళ మహబూబ్‌నగర్ జిల్లా పార్లమెంటు సభ్యులతో పాటు సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు హరీష్‌బాబు ఉన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీ కేంద్రం ప్రారంభం



వాహనాలను తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారులు

జైనథ్‌రూరల్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ అయింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బోరజ్ ఉమ్మడి తనిఖీ కేంద్రం వద్ద బుధవారం తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జైనథ్ మండల పశువైద్యాధికారి డాక్టర్ వినోద్ దేశ్‌పాండే, ఆదిలాబాద్ డాక్టర్ సతీష్‌లు మాట్లాడుతూ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లను తెలంగాణ రాష్ట్రానికి రవాణాకు వస్తే తిరిగి అదే ప్రాంతానికి వాహనాలను పంపిస్తున్నారు. ఈ తనిఖీని మూడుషిఫ్టులుగా ఉంటాయన్నారు. ఉదయం ఆదిలాబాద్ డాక్టర్ సతీష్, వెటర్నరి అసిస్టెంట్ సతీష్, మధ్యాహ్నం జైనథ్ మండల పశువైద్యాధికారి డాక్టర్ వినోద్ దేశ్ పాండే, వెటర్నరీ అసిస్టెంట్ విశాల్, సాయంత్రం గిమ్మ పశువైద్యాధికారి డాక్టర్ సిద్ధార్థ, వెటర్నరీ అసిస్టెంట్ ముజీబ్ ఖాన్‌లు తనిఖీలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బోరజ్ ఉమ్మడి తనిఖీకేంద్రం ఎంవీఐ జి.ప్రదీప్‌కుమార్ గౌడ్, ఏఎంవీఐ మోహన్‌గౌడ్‌లతో పాటు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని ఫిర్యాదు



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ ఏజెన్సీ సర్టిఫికెట్లతో ఉద్యోగా లు పొందిన వారిపై విచార ణ జరిపించాలని ఆదివాసీ గిరిజన విద్యార్థుల సంఘం నాయ కులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం సంఘం నాయకుడు సుమేష్ మాట్లాడుతూ 2017లో జరిగిన ఉపాధ్యాయుల నియామకాల్లో ఆదివాసీ గిరిజనులకు చెందాల్సిన ఉద్యోగాలను కొందరు నకిలీ సర్టిఫికెట్లతో పొందారన్నారు.

ఫుడ్‌అండ్‌బేవరేజ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉట్నూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ఉన్న పదోతరగతి పూర్తిచేసిన గిరిజన యువతకు హైదరాబాద్‌లోని కేసీ పుల్లయ్య ఫౌండేషన్, యునైటెడ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఫుడ్‌అండ్‌బేవరేజ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్‌అండ్‌బేవరేజ్ కోర్సులో శిక్షణ ఇచ్చే సమయంలో హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ప్రతినెల 18 వేల నుంచి 25 వేల వరకు విధానాలతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు ధ్రువీకరణ పత్రాలతో ఐటీడీఏకు వచ్చి గిరిజన శిక్షణ ఉపాధి కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి



సిరికొండలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

సిరికొండ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పౌరుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం చేపట్టామని మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో ఫణీందర్ అన్నారు. బుధవారం సిరికొండ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడే పరిష్క రించేం దుకు కృషిచేస్తున్నామని ప్రత్యేకాధికారి ఫణీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ తుకారం, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బజార్‌హత్నూర్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండలంలో ఏర్పాటు చేయాలని మండల రైతులు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదుల విభాగంలో అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జొన్నల కొనుగోలు కేంద్రం ఇచ్చోడ పరిధిలో ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్రఇబ్బందులకు గురవతున్నారని, పండిన పంటను ఇచ్చోడకు తరలిం చేందుకు అదనంగా రవాణా ఖర్చువడంతో మరింత భారం తమపై పడుతుందని అధికారులకు తెలిపారు. కావున ఈ సంవత్సరం కొనుగోలు కేంద్రాన్ని మండల పరిధిలోనే ఏర్పాటు చేసేల చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల స్పెషల్‌అధికారి మోహన్, తహసీల్దార్ శ్యామ్‌సుందర్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి, డీటీ హీరాలాల్, ఆర్ఐ నూర్ సింగ్, వ్యవసాయ అధికారి మహ్మద్ సౌద్ పాల్గొన్నారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తి అరెస్టు

బజార్‌హత్నూర్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏసాపూర్ గ్రామానికి చెందిన మాది శ్రీరామ్ అనే వ్యక్తి గంజాయి సాగుచేయడంతో ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుండి విత్తనాలను సేకరించి గంజాయి సాగుచేస్తున్నాడన్న విశ్వస నీయ సమాచా రంతో దాడి చేసి పట్టుకున్నామని, ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

హిమతేజ దేశానికి ప్రాతినిధ్యం వహించాలి



హిమతేజను సన్మానిస్తున్న ముడుపు మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌కి చెందిన హిమతేజ రంజీ తరపున క్రికెట్ ఆడడం గర్వకారణమని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. హిమ తేజ రంజీల్లో ఆడడం జిల్లాకి గర్వకారణమని, ఆయన దేశానికి ప్రాతి నిధ్యం వహించాలని ఆకాంక్షించారు. కోరెడ్డి శ్రీనివాస్, దినేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సంగీత

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే నైపుణ్యాలను కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ ప్రిన్సిపల్ డాక్టర్ జె.సం గీత అన్నారు. తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో టాస్క్‌సౌజన్యంతో కమ్యూనికేషన్ నైపుణ్యాలపై బుధవారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే కమ్యూనికేషన్ నైపుణ్యాలు (సాఫ్ట్ స్కిల్స్)పై ప్రావీణ్యం పొంది, ఎంతో విలువైన శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల టీఎస్ కేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రావణి, టీఎస్ కేసీ మెంటార్ ఎండీ ఇమ్రాన్‌అలీ, టాస్క్ శిక్షకుడు మార్క్ లూయిస్ హర్ని పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

బోథ్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాలుగు లక్షల నగదు,7 తులాల బంగారం, 13 తులాల వెండి మండల కేంద్రంలోని ఉస్మాన్ అనే వ్యాపారికి చెందిన ఇంటిలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. చోరీకి పాల్పడిన దొంగలు ఇంటి వెనక కిటికిని పగలగొట్టి అందులో నుంచి లోపలికి ప్రవేశించినట్లు తెలిపారు. అయితే అర్ధరాత్రి కుటుంబసభ్యులు వివాహవేడుకకు హాజరై ఇంటికి తిరిగి వచ్చారు. ఇంట్లోకి రావడంతో పగిలి ఉన్న బీరువా సామగ్రి చిందర వందర పడేసి ఉండడంతో వెంటనే కుటుంబ యజమాని పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మాజీముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిఒక్కరూ మూడు మొక్కలు నాటి, నాటిన మొక్కతో సెల్ఫీ తీసుకుని 9000365000 నంబరుకు వాట్సప్ ద్వారా పంపాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పిలుపునిచ్చారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17న గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ నిర్వహించే వృక్షార్చన పోస్టర్లను బోథ్ ఎమ్మెల్యే బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాడ్గే దీపక్, తులసీరామ్, స్వప్నిల్, హరితసేన సభ్యులు పాల్గొన్నారు.



కిష్టాపూర్‌లో మేళాకు హాజరైన జనం

మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మధుర రాజ్పుత్ వారు నిర్వహించిన మేళాలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ రాథోడ్‌సృజన్, మాజీ జడ్పీటీసీ జహీర్, పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, మాజీ సర్పంచ్ గీతాకరణ్‌సింగ్, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.

బోథ్: సమీప భవిష్యత్తులో మారుమూల గ్రామాలకు అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, రేండ్లపల్లి, నక్కలవాడ గ్రామాలలో గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించారు. ఆయన వెంట మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్

(5వ పేజీ తరువాయి)

వస్తుంది అనే విషయాన్ని అంచనా వేసి సంబంధిత ఏఈవోలు తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాల్సి ఉంటుంది. ఈ టీఆర్ ఆధారంగానే మార్కెటింగ్ శాఖాధికారులు పత్తిని అమ్ముకునేందుకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే కొంత మంది అధికారులు అడ్డగోలుగా టీఆర్ పత్రాలను జారీ చేసినట్లు తెలిసింది. ఓ మండల స్థాయి అధికారి అయితే ఏఈవోలకు సంబంధం లేకుండానే ఏకంగా టీఆర్ పత్రాలను ముద్రించి ధ్రువీకరిస్తూ దళారులకు సీసీఐకి పత్తిని అమ్ముకునేందుకు అవకాశం కల్పించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మార్కెట్ పరిధిలో జారీ చేసిన టీఆర్ పత్రాలను పరిశీలిస్తే భారీ అవకతవకలు, అక్రమాలు బయట పడే అవకాశం ఉందంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిని సారించాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

దళారుల ఎత్తుగడలు

గ్రామాల్లో రైతుల నుంచి విడివిడిగా పత్తిని సేకరించిన దళారులు తిరిగి అదే పత్తిని సీసీఐకి విక్రయిస్తూ అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. ఎకరాన 12 క్వింటాళ్ల పత్తిని అమ్ముకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. కానీ నీటి వసతి లేని భూములు, భర్కం భూముల్లో 5, 6 క్వింటాళ్ల వరకే పత్తి దిగుబడులు వచ్చాయి. ఇలాంటి బినామీ రైతుల పేరిట పత్తిని అమ్ముకునేందుకు దళారులు ఎత్తుగడలు వేస్తున్నారు. రైతుల పట్టా పాస్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలను తీసుకుని రైతుల పేరిట సీసీఐకి పత్తిని అమ్మేసుకోవడం దళారులకు అలవాటుగానే మారింది. ఇదంతా అధికారుల అండదండలతోనే జరుగుతున్నా అడిగే వారే కరువవుతున్నారు. రైతులకు కొంత కమీషన్ రూపంలో ఇస్తూ రైతుల ఖాతాల్లో నుంచి డబ్బులను డ్రా చేసుకుంటున్నారు. ప్రభుత్వం అవకాశం కల్పించిన మేరకు పంట దిగుబడులు రాక పోయినా గరిష్ఠ మొత్తంలో రైతుల పేరిట పత్తిని విక్రయిస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన వేల క్వింటాళ్ల పత్తిని దళారులు ఎక్కడ విక్రయించారన్న దానిపై విచారణ జరిపితే అసలు విషయం బయట పడే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ సదస్సులో పాల్గొన్న ఉట్నూర్ ఉపాధ్యాయులు

ఉట్నూర్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో ట్రెండ్స్ అండ్ ఇన్సైడ్‌ఇన్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ పోస్టు ఎన్‌ఈపీ 2020, అనే అంశం పై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సులో ఉట్నూర్ మండలానికి చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉట్నూర్ మండలంలోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు కుంరం శ్రీనివాస్, జాదవ్‌రాజ్‌కుమార్‌లు ఏ స్టడీ ఆఫ్ ఎక్స్‌ప్లోరింగ్ కన్‌స్ట్రక్టివిస్ట్ అప్రోచెస్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ టూ ప్రైమరీ లెవెల్ టీచర్స్ ఆఫ్ ఆదిలాబాద్ డిస్టిక్ అనే అంశంపై ఇరువు ఉపాధ్యాయులు ఒక పరిశోధన పత్రమును హసు హైదరాబాదులో నిర్వహించిన జాతీయ సదస్సులో పరిశోధన పత్రంను సమర్పించి ప్రసంగించారు. ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆంగ్లభాషను అభ్యసించడంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి పరిశోధన - వినూత్న బోధన పద్ధతుల గురించి వారి పరిశోధన పత్రం ద్వారా దేశవ్యాప్తంగా ఎందరో విశ్వ విద్యాలయాల, ప్రొఫెసర్లు, రీసెర్చ్ పరిశోధకులు, జాతీయ అంతర్జాతీయ పాఠ శాలల, అకాడమిక్ డైరెక్టర్ల సమక్షంలో పరిశోధన పత్రాన్ని సమర్పించామన్నారు. ఉపాధ్యాయులను మండల విద్యాధికారి ఆశన్న, ప్రధానోపాధ్యాయులు రమేష్ అభినందించారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి

నార్నూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హెల్త్‌సూపర్‌వైజర్ చవాన్ చరణ్‌దాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఐదు సబ్‌సెంటర్‌ల వద్ద 50 బాక్స్‌లు టెస్ట్ తీసుకున్నామని తెలిపారు. నిక్షయ్ సివిరున్న వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని గురించి ఆయన వివరించారు. రెండువారాలకు మించి దగ్గు ఉండడం, గళ్ల పడడం లాంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పరీక్షలన్నీ ఉచితంగా చేస్తామన్నారు. ఛాతిలో నొప్పి, జ్వరం, ఆకలి మందగించడం లాంటి లక్షణాలుంటే అశ్రద్ధ చేయకుండా టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే సంబంధిత రోగులకు ఉచితంగా టీబీ మందులు పంపిణీ చేస్తామన్నారు. పౌష్టికాహారం కోసం నగదు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌ఓ సుశీల, ఎల్‌టి జాదవ్, రవీందర్, ఆశా కార్యకర్తలు ఆరే జ్యోతి, లక్ష్మి, రత్నబాయి, ఆర్.నీలాబాయి పాల్గొన్నారు.



టెస్ట్ బాక్స్‌లు అందిస్తున్న సిబ్బంది

సీఎం కక్ష పూరితంగా వ్యవహరిసున్నారు : మాలల సంక్షేమ సంఘం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మాలల పట్ల సీఎం రేవంత్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్ ఆరోపించారు. బుధవారం ఆదిలాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్‌కు చట్టబద్ధత లేదని, వర్గీకరణ విషయంలో తప్పుడు లెక్కలు చూపు తున్నారని పేర్కొన్నారు. అయనతోపాటు రాఘవేందర్, సుధీర్ ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి

నార్నూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీ స్పోర్ట్స్ ఆఫీసర్ కె.పార్థసారథి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పదోతరగతి పాసైన తర్వాత భవిష్యత్తు కోసం మంచి ప్రణాళికతో పై చదువుకోవాల్సిన అవసరం ప్రతి విద్యార్థిపైన ఉందని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యపరంగా యోగా చాలా ముఖ్యమైన అంశమని సలహా ఇచ్చారు. అనంతరం వంటశాల ఇతర రూమ్‌లు పర్యవేక్షించి ఉపాధ్యాయ సిబ్బందిలకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిలకు ఆదేశించారు. అనంతరం స్పోర్ట్స్ ఆఫీసర్‌ను ఉపాధ్యాయ బృందం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాదవ్ విఠల్, శంకర్, సూరజ్ సింగ్, పీడీ విశ్వనాథ, నీలమ్మ, విజయ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన జట్టుతో అధికారులు, నాయకులు

కుంటాల, ఫిబ్రవరి, 12 : (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20 తేది నుండి 23వ తేదీ వరకు వికారాబాద్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా స్థాయి నుండి 12 మందితో కూడిన జట్టు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు భూపతి రెడ్డి, కార్యదర్శులు సునీల్, హేమలతలు పేర్కొన్నారు. బుధవారం జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలను కుంటాల స్థానిక విజయ సాయి పాఠశాలలో నిర్వహించారు. ఇట్టి పోటీలకు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులతో పాటు కుంటాల ఎస్సై భాస్కరా చారి పాల్గొన్నారు. ఎంపికైన జట్టును అభినందించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, క్రీడల పట్ల మొగ్గు చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న, మాజీ ఎంపీపీ రమణరావు, స్థానిక నాయకులు జక్కుల గజేందర్, దొనికెన వెంకటేష్, సంతోష్, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుభీర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థాగత ఎన్నికలు రానున్న నేపథ్యంలో బుధవారం మండలంలోని చాత, శివుని, శివుని తండాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీడీవో మోహన్‌సింగ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫర, మరుగుదొడ్లు, తాగు నీరు, వీల్ ఛైర్స్, బెంచీలు, కుర్చీలతో పాటు ఓటర్లు ఇబ్బంది పడకుండా తగు సౌకర్యాలను కల్పించాలన్నారు.

మొక్కల రక్షణకు జాగ్రత్తలు పాటించాలి

కుభీర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల రక్షణకు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో నవనీత్‌కుమార్ అన్నారు. బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని చాత గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ముఖ్యంగా వేసవిలో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. గ్రామంలో తాగు నీటి ట్యాంకుల్లో వారానికోసారి శుభ్రపరచి బ్లీచింగ్ చేయాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. బకాయి పడ్డ ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేసి గ్రామాభివృద్ధికి పాటు పడాలని జీపీ సిబ్బందికి సూచించారు.

బైండోవర్ అయ్యాక

గుడుంబా మళ్లీ విక్రయిస్తే కఠినచర్యలు

● 10 మంది నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన ఎక్సైజ్ అధికారులు ● నిందితులను హెచ్చరించిన తహసీల్దార్

ఖానాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఒకసారి నేరం చేస్తూ పట్టుబడి బైండోవర్ అయ్యాక తిరిగి అదే నేరాన్ని చేస్తే కఠిన శిక్ష తప్పదని ఖానాపూర్ తహసీల్దార్ సుజాత అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పది మంది వ్యక్తులను గుడుంబా విక్రయానికి పాల్పడుతున్నారంటూ ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ సుజాత ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా బైండోవర్ అయిన వ్యక్తులకు తహసీల్దార్ కౌన్సిలింగ్ చేశారు. బైండోవర్ అంటే ఏంటో వారికి వివరించారు. ప్రస్తుతం గుడుంబా విక్రయిస్తూ పట్టుబడిన నేరం కింద తన ఎదుట బైండోవర్ అయిన వారంతా భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లో గుడుంబా విక్రయానికి పాల్పడవద్దన్నారు. ఒకవేళ తిరిగి విక్రయిస్తే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.



గుడుంబా విక్రయిస్తూ పట్టుబడి బైండోవర్ అయిన నేరస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కాగా బాధనకుర్తి గ్రామానికి చెందిన తిరుమల, గోసంపల్లె గ్రామానికి చెందిన వర్షిత, పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిర ఎర్రన్న, రాజేశ్వర్, సుర్జాపూర్ గ్రామానికి చెందిన చిన్నయ్య, ఊశన్న, ఖానాపూర్‌కు చెందిన చిన్న నర్సయ్య, వెంకటి ఉమాదేవి, బీర్నందికి చెందిన సుగుణలను గుడుంబా విక్రయిస్తున్న నేరం కింద బైండోవర్ చేశారు.

ఎక్సైజ్ నిర్మల్ సీఐ రంగస్వామి ఆదే శాల మేరకు ఖానాపూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి హాజరు పరచామని ఎక్సైజ్ కానిస్టేబుళ్లు గౌతమ్, రవీందర్‌లు తెలిపారు.

కడ్తాల్‌లో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రథమ వార్షికోత్సవం

సోన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామంలో శ్రీ వీర బ్రహ్మేంద్ర ప్రథమ స్వామి వార్షికోత్సవం చంద్రకాంత్ (రామానంద స్వామి) ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల కళ్యాణ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సిద్ధార్థ ఆచార్యులు యజ్ఞ యాగాదులు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కళ్యాణంలో దంపతులు రుక్మాబాయి నర్సింలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాత్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. కిషన్ చారి, నిర్మల్ జిల్లా కన్వీనర్ అశోక్ చారి, కడ్తాల్ సర్పంచ్ నర్సయ్య, ఈశ్వరి బాయి, భక్తులు, మాతలు వెంగమాంబ, పూల రాములు, గంప శ్రీనివాస్, సుందర సత్సంగ్, గౌరవ అధ్యక్షులు, కడ్తాల్ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి భక్తులు, మాతలు పాల్గొన్నారు.



పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కల్యాణ దృశ్యం

ఘనంగా టీఈఈ1104 యూనియన్

ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

భైంసా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో బుధవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ ప్రవేశ మార్గంలో యూనియన్ శ్రేణులు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. వేడుకలలో భాగంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు, డివిజన్ అధ్యక్షులు దేవురావ్, కార్యదర్శి గంగాకిషన్ ఆధ్వర్యంలో యూనియన్ జెండాను ఎగురవేశారు. అనంతరం యూనియన్ శ్రేణులు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, దేవ్‌రావు, గంగాకిషన్‌లు మాట్లాడుతూ.. యూనియన్ ఆవిర్భావించిన పిదప విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమం సాధించుకోవడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్నో సమస్యలను పరిష్కారించడంలో యూనియన్ సఫలీకృతమైందన్నారు. అనంతరం 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనియన్ శ్రేణులు పలు ప్రదర్శనలు చేపట్టాయి. ఇందులో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు నసీరోద్దీన్, కంపెనీ నాయకులు కిషన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

కుభీర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రం కుభీర్‌లో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పట్టభద్రుల అసెంబ్లీ ఇంచార్జీ హరి నాయక్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించుకోవాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇంచార్జీ శివచంద్ర మాట్లాడుతూ బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్యకి ఉపాధ్యాయుల చేత మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పడిపెల్లి గంగాధర్, తాడేవార్ సాయినాథ్, ఏశాల దత్తాత్రి, బోయిడి అభిషేక్, గంగాశేఖర్, కమలేష్, పండిత్, వెంకట్‌స్వామి, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కుంటాల, ఫిబ్రవరి, 12 : (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో పరిసరాలను శుభ్రపరిచారు.

16న జరిగే సభ ఏర్పాట్లను

పరిశీలించిన డీసీసీ అధ్యక్షుడు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశ సభ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పరిశీలించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 16న మండలంలోని కొండాపూర్‌లో గల చంద్రశేఖర్ కన్వెన్షన్‌లో జరగనున్న ముఖ్య నాయకుల సమావేశ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఏజీపీ



న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏజీపీ ఆసిఫ్ అలీ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జూనియర్ సివిల్ కోర్టులో నూతనంగా నియమితులైన ఏజీపీ ఆసిఫ్‌అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి పి. అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏజీపీగా నియమితులైన ఆసిఫ్ అలీకి న్యాయాధికారి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రభుత్వ న్యాయవాది శుభకరణ్, న్యాయవాదులు రమణగౌడ్, మొహమ్మద్ ఖాజా, రమణ రావు, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ ప్రైమ్ నిర్మల్ విద్యార్థి ప్రతిభ



చిన్నారిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భద్రాద్రిలో భక్త రామదాసు 392వ జయంతి వేడుకల సందర్భంగా భద్రాద్రి సాంస్కృతిక వారధి వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ 2వ తరగతికి చెందిన శాన్వి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రశంసాపత్రం అందుకుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులను స్కూల్ జోనల్ ఇన్‌చార్జి నగేష్, ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ శాలువాతో సత్కరించారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన నిర్మల్ స్టూడెంట్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ పరీక్షలో నిర్మల్‌కు చెందిన కోటగిరి అభినవ్ 99.17 పర్సంటేజ్ సాధించాడు. ఎన్‌టీఏ విడుదల చేసిన ఫలితాల్లో ర్యాంక్ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. స్థానిక ప్రియదర్శినగర్‌లో నివాసం ఉండే కోటగిరి వరప్రసాద్ శ్రీలతల కుమారుడైన అభినవ్ మరింత మెరుగైన ర్యాంక్ సాధించి ఐఐటీలో సీటు సంపాదించడమే తన ధ్యేయమన్నారు.

బోధనలో సాంకేతికతను వినియోగించుకోవాలి

సోన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న వినూత్న మార్పులకు అనుగుణంగా తరగతి గదిలో పాఠ్యాంశ బోధన జరగాలని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు.



జాతర మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఘనంగా అక్కకొండ లక్ష్మీ నరసింహ స్వామి జాతర

● పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిల్దార్ నగర్ గ్రామ సమీపాన గల అక్కకొండ లక్ష్మీ నరసింహ స్వామి జాతర మహోత్సవంలో ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఏ సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని, ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. లక్ష్మీ నరసింహ స్వామివారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని, ప్రపంచమంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రమేష్ వర్మ, నాయకులు భూషణం, తక్కల సత్యనారాయణ, బొడ్డు, గంగన్న, కోల శ్రీనివాస్, కమలాకర్, రమేష్, సుధాకర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు

ఇచ్చోడ, ఫిబ్రవరి, 12 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల కేంద్రంలో బుధవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణ మహోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలకు బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై దగ్గరుండి కల్యాణ వేడుకలను జరిపించారు. కల్యాణ వేడుకలు చూసేందుకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, నాయకులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో..



ఉట్నూర్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి కల్యాణం దృశ్యం

ఉట్నూర్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మాఘశుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని ఉట్నూర్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ప్రాంగణంలో బ్రహ్మేంద్రస్వామితో గోవిందమాంబ కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మానవుడిగా పుట్టి కాలజ్ఞానం చెప్పి భవిష్యవాణిలను వినిపించి కుల మత కలహాలకు సమాధి కట్టి సంస్కరణ వాదంతో మానవులకు జ్ఞానోదయం కలిగించిన మహనీయుడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం తిలకించడం అదృష్టంగా ఉందని భక్తులు భావించారు. విశ్వబ్రహ్మణ సంఘం స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణానికి భక్తులుతరలివచ్చి కళ్యాణ అనంతరం అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కట్టప్రభాకర్‌చారి, ముడుపు సాయికృష్ణ చారి నారోజు విజయ్‌కుమార్, రంగుమధుకరచారి, రంగుసత్యనారాయణ, ముడుపు సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పులాజీబాబా ఆలయ వార్షికోత్సవం

● హాజరైన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, ఫిబ్రవరి, 12 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడలోని ఇస్లాంనగర్ గ్రామ సమీపంలో ఉన్న పులాజీబాబా ఆలయ ధ్యానమందిర 37వ వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బోథ్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆశ్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం పూలాజీ బాబా సంస్థన్ అధ్యక్షుడు ఇంగ్లె కేశవ్ మాట్లా డుతూ.. మానవసేవే.. మాధవసేవగా భావించే బాబాభక్తులు బాబా ఆచరణలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ జాదవ్, సభ్యులు మారుతీ, పాండురంగ్, కొండిబా, మనోహర్ పాల్గొన్నారు.



ఇస్లాంనగర్‌లో పులాజీబాబా ఆశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కంది రైతులకు ఆన్‌లైన్ తిప్పలు

● సాగు చేసిన కంది పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు
● కుభీర్ మండల రైతుల ఆగ్రహం



ఆంధ్రజ్యోతి పరిశీలన

కుభీర్‌లో రైతులు లేక వెలవెలబోతున్న కందుల కొనుగోలు కేంద్రం

కుభీర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడిన కంది రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో మండలంలో ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి క్వింటాలుకు రూ. 7550 చొప్పున ఎకరాకు 3.31 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా కుభీర్ మండలంలో మొత్తం 48207.14 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఈ ఖరీఫ్ మండలంలోని గ్రామాల రైతులు 29,045 ఎకరాల్లో పత్తి, 17,973 ఎకరాల్లో సోయాబిన్, 284 ఎకరాల్లో మొక్కజొన్న, 2762 ఎకరాల్లో కందిపంట, 50 ఎకరాల్లో పసుపు, 261 మిశ్రమ పంటలను సాగు చేసినట్లు వ్యవసాయా శాఖ అధికారులు తెలుపుతున్నారు. కాగా మండల రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి నమోదు చేయకుండా తమకు తెలిసిన విధంగా నమోదు చేశారని మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, సోయాబీన్ పంటల్లో అంతర్‌పంటగా వేసిన కంది పంటను నమోదు చేయలేదని దీంతో ఆన్‌లైన్‌లో తమ కంది పంట సాగు వివరాలు లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తమ కంది పంటను విక్రయించకుండా ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రైవేటు వ్యాపారులకు కందులు విక్రయిస్తే జల్లెడ చేయడం, హడతి హబాలి, పేరిట క్వింటాలుకు కేజీ రెండు కేజీలు కట్ చేసి మార్కెట్ కంటే రూ. 500లు తగ్గించి ఇస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా నాయకులు, జిల్లా స్థాయి అధికారులు తమ సమస్యను ప్రభుత్వానికి తెలియజేసి రీ సర్వే చేయించాలని లేక పోతే క్షేత్ర స్థాయిలో తాము సాగు చేసిన కంది పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి టోకెన్‌లను అందించాలని, ఆ టోకెన్‌లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించే వసతి కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ మండల అధికారి సారికకు వివరణ కోరగా తాము ఖరీఫ్ పంటు సాగు వివరాలు నమోదు ప్రక్రియ పూర్తయ్యాక మండలానికి బదిలీపై వచ్చామని రబీ పంట వివరాలు క్షేత్రస్థాయిలో వెళ్లి నమోదు చేస్తున్నామన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

● కందూర్ సాయినాథ్, రైతు, కుభీర్



ఖరీఫ్‌లో కంది పంటను సాగు చేసిన రైతులకు న్యాయం జరిగేలా రీ సర్వే చేయించాలి. పత్తి, సోయాబీన్ పంటలో అంతర్ పంటగా సాగు చేసిన కంది పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. కొందరి రైతులకు నమోదు చేసిన ఐదేకరాల సోయ సాగులో అంతర్ పంటగా సాగు చేసిన కంది పంటను గుంటలో నమోదు చేశారు. ఆంక్షలు లేకుండా మండల రైతుల నుంచి కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఎకరాకు ఎనిమిది క్వింటాళ్లు కొనుగోలు చేయాలి.

సల్లంగా చూడు మల్లన్న!

● అంగరంగ వైభవంగా దేవుడి కల్యాణం ● పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్‌బిడ్ మల్లన్న దేవుడికి చల్లని అంబళ్ళను భక్తులు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. జాతర ప్రారంభమైన రెండో రోజైన బుధవారం ఎడ్‌బిడ్‌తో పాటు మండలంలోని వెంకటాపూర్, కారేగాం, చింతకుంట, చించాల, భైంసా మండలంలోని పుష్పూర్, కామోల్ గ్రామాల నుంచి భక్తులు కాలినడకతో చల్లని అంబళ్ల నెత్తి పైన తీసుకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సభ్యులంతా సుఖ సంతోషాలతో ఉంటారని భక్తుల నమ్మకం. ఆలయంలో భక్తులు సత్యనారాయణ పూజలు చేవారు. అలాగే జాతర ప్రారంభమైన మొదటి రోజు మంగళవారం రాత్రి దేవుడి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. మల్లన్న దేవుడి కల్యాణం తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తరలివచ్చారు. నిర్వాహకులు, గ్రామస్థులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతర శుక్రవారం వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో పండితులు వైభవ్, బసవ రాజు, పూజారులు గొల్ల ఆశన్న, అశోక్, గ్రామస్థులు సాయంరెడ్డి, రాంరెడ్డి, ఉదయ్, గంగారెడ్డి, లక్ష్మణ్, సుధాకర్, మల్లేష్, విఠల్ యాదవ్, కే. గురుప్రసాద్ యాదవ్, నిమ్మ పోతన్న, మానిక్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



చల్లని అంబళ్లతో భక్తులు



మల్లన్న దేవుడి కల్యాణానికి హాజరైన భక్తులు



మల్లన్న దేవుడి కల్యాణం


ఘనంగా శివ దత్తసాయినాథ ఆలయ వార్షికోత్సవం

భక్తి



శివదత్తసాయినాథ ఆలయంలోని వినాయకుడు, దత్తాత్రేయ విగ్రహాలు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శివ దత్తసాయి నాథ ఆలయ వార్షికోత్సవాన్ని మండలంలోని మునిపెల్లి గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గల సాయిబాబా, శివలింగం, వినాయకుడు, దత్తాత్రేయ, నందీశ్వరుడు విగ్రహాలకు అభిషేకం చేశారు. నూతన వస్త్రా లంకరణ చేసి పూలమాలలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి హారతి నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించిన పల్లకీ సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్ర మానికి హాజరైన భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి బండపాటి రమేష్ చారి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



శివదత్తసాయినాథ ఆలయంలో సాయిబాబా విగ్రహం



మునిపెల్లిలో నిర్వహిస్తున్న శివదత్తసాయి పల్లకీ సేవ



ఎమ్మెల్సీ అభ్యర్థుల

నామినేషన్ల ఉపసంహరణ నిల్

● నేటితో ముగియనున్న గడువు

కరీంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగియనుందని, బుధవారం అభ్యర్థులెవరూ ఉపసంహరించుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని, పరిశీలనలో 32 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, 68 మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైందని, 16 మంది నామినేషన్లు సరిగా ఉన్నట్లు ప్రకటించామని పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముగియనున్నట్లు వెల్లడించారు.

సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం

● సారలమ్మకు బోనాలు, ఓడి బియ్యం సమర్పణ
● మొక్కులు తీర్చుకున్న భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో గల గుట్టలో వెలిసిన శ్రీ సమ్మక్క సారలమ్మ మినీజాతర బుధ వారం ప్రారంభమైంది. దేవాలయ పూజారి జాదవ్ రేణుకమ్మ, ఆలయ ధర్మకర్త జాదవ్ సతీష్‌లు భాజభజంత్రీలతో మొదటి రోజు సారలమ్మకు బోనాలు, ఓడి బియ్యం తీసుకువచ్చి శ్రీ సారలమ్మకు సమర్పించారు. కోరిన కోరికలు నెరవేరాలని వన దేవతలకు భక్తులు మొక్కులు చెల్లించారు. మొదటి రోజు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. వన దేవతలకు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కిన మొక్కులు నెరవేరాలని నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించారు. మరికొందరు మేకలను బలిచ్చారు. ఈ జాతర శుక్రవారం వరకు జరుగుతుంది.



ఎడ్‌బిడ్ తండాలో పూనకంతో ఊగుతున్న మహిళలు



సారలమ్మ వద్ద భక్తులు

ఘనంగా భీమన్న జాతర



భీమన్న దేవుడికి పూజలు చేస్తున్న భక్తులు

నేరడిగొండ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గారాం గ్రామంలో బుధవారం భీమన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతి యేటా మాఘ పూర్ణిమ రోజున తమ ఆరాధ్య దైవం భీమన్న దేవుని జాతర నిర్వహించడం అన వాయితీగా వస్తోంది, ప్రతియేటా తమ ఆరాధ్య దైవాన్ని పూజించడం వల్ల తమ గ్రామంతో పాటు కుంటుంబాలలో సుఖ శాంతులు నేలకొంటాయని వారి నమ్మకం. కొండపై కొలువైన భీమన్న దెవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర రోజు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు.

ఫొటో న్యూస్





కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న ఠాగూర్ హోటల్ సమీపంలోని చికెన్ షాపులు



నిర్మానుష్యంగా కనిపిస్తున్న పాత బస్టాండ్ సమీపంలోని చికెన్ సెంటర్లు



బర్డ్ ఫ్లూ భయం

● చికెన్ వ్యాపారులకు తగ్గిన ఆదాయం


ఏపీలో కోళ్లకు వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో దాని ప్రభావం జిల్లాపై సైతం పడింది. రోజు రోజుకు బర్డ్ ఫ్లూ కేసులు పెరుగుతుండడంతో చికెన్‌ను ఖరీదు చేసేందుకు జనాలు ఆసక్తి చూపడం లేదు. ధరలు భారీగా తగ్గినప్పటికీ చికెన్‌ను కొనేందుకు జంకుతున్నారు. దీంతో పట్టణ పరిధిలో నిత్యం వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించే చికెన్ దుకాణాలు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

●(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



ఆంధ్రజ్యోతి

andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 : కనిష్ఠం 19.8



నిర్మల్
జిల్లా వార్తలు
8
గురువారం 13 ఫిబ్రవరి 2025



కమిటీల కాలయాపన

- బాసర ట్రిపుల్ ఐటీలో కమిటీల ప్రహసనం
- సమస్యలు వచ్చినపుడు ప్రభుత్వ ఒత్తిడితో కమిటీ ప్రకటన
- నియామకానికే పరిమితం.. మొక్కుబడిగా వ్యవహారం
- నివేదికలు రావు.. బాధ్యులపై చర్యలు తీసుకోరు
- బాధితులకు జరగని న్యాయం.. విద్యార్థులకు దొరకని అభయం

బాసర, ఫిబ్రవరి, 12 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేస్తున్న విచారణ కమిటీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజనిర్ధారణ కోసం నియమిస్తున్న కమిటీలు ఏర్పాటు వరకే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీ గత కొంత కాలంగా వివాదాలకు కేంద్రంగా మారింది. నిత్యం ఏదో ఒక ఘటనతో వార్తల్లోకెక్కుతుంది. ప్రతీసారి అధికారులు స్పందించడం, చర్యల కోసం విచారణ కమిటీలను వేస్తున్నామంటూ ప్రకటించి సమస్యను శాంతింపజేసే ప్రక్రియ ఇక్కడ కొనసాగుతుంది. ఇంత వరకు భాగానే ఉంది. కాని ఆ తర్వాత అసలు సమస్య ఏర్పడుతుంది. విచారణ చేపట్టి నిజాలను నిగ్గు తేల్చాల్సిన కమిటీలు మొక్కుబడిగా మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కమిటీల ఏర్పాటును ఆర్భాటంగా ప్రకటిస్తున్న అధికారులు ఆ తర్వాత విషయాలను మాత్రం వెల్లడించడం లేదు. నివేదికలు, బాధ్యులపై చర్యలు వంటివి దాచి పెడుతున్నారు. దీంతో ట్రిపుల్ ఐటీలో కమిటీలు... కాలయాపన కోసమే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాధ్యులపై చర్యలు కరువు

గడిచిన రెండు, మూడేళ్ల వ్యవధిలో అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రతిసారి అధికారులు ప్రభుత్వం నుంచి ఒత్తిడి వచ్చినప్పుడల్లా కమిటీలను వేశారు. విద్యార్థుల సమస్యలు ఆందోళనలు చేసినప్పుడు సైతం ప్రత్యేక అధికారులను నియమించి గడువులోగా సమస్యలు పరిష్కరిస్తామని విద్యార్థులకు నచ్చజెప్పేవారు. విద్యార్థులు ఆత్మహత్యలు వంటి తీవ్ర ఘటనలు చోటుచేసుకున్న సందర్భాల్లోను అధికారులు విచారణ కమిటీలను నియమించారు. ఒక్కటి కాదు విద్యార్థుల వసతులు, అనుకోని ఘటనలు, హస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకున్న సందర్భాల్లోను ఇలా ప్రతిసారి నిజ నిర్ధారణ కోసం ఇక్కడ కమిటీలు వేయడం ఆనవాయితీ. ఏ సందర్భంలో కూడా బాధ్యులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. బాధ్యులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అధికారులు చూసి చూడనట్లు వదిలివేయడమే ఇందుకు కారణంగా తెలుస్తుంది. ఫలితంగా ట్రిపుల్ ఐటీలో నిర్లక్ష్యం అనేది నిర్మూలించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

మచ్చుకకు కొన్ని..

- ట్రిపుల్ ఐటీలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా యూనివర్సిటీలోకి వెళ్లి యూనివర్సిటీ ఉద్యోగితో మత ప్రచారం చేశారనే ఆరోపణలపై త్రిసభ్య కమిటీని నియమించారు. ఆ తర్వాత ఆ కమిటీ నివేదిక కాని, తీసుకున్న చర్యలు వంటివి ఇప్పటి వరకు వెలుగు చూడలేదు.
- యూనివర్సిటీలో ఒక విద్యార్థి గోడపై నుంచి పడి మృతి చెందారు. మరో విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారని మందలించడం వల్ల ఆత్మహత్య చేసుకుంది.

ఈ రెండు ఘటనలపై తల్లిదండ్రుల నుంచి విద్యార్థి సంఘాల నుంచి అనుమానాలు వ్యక్తం చేయడంతో యూనివర్సిటీ అధికారులు కమిటీలు వేసి విచారణ కమిటీ నియమించారు. ఆ తర్వాత కమిటీల నివేదిక ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఇప్పటి వరకు తెలియదు.

- 2022 సంవత్సరంలో ఇద్దరు ఉద్యోగులు విద్యార్థులను వేధించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీనిపై కూడా కమిటీ వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.
- విద్యార్థుల వద్ద గంజాయి దొరికిన ఘటనలో మాత్రం బాధ్యులైన విద్యార్థులు, ఒక ప్రైవేటు వర్కర్‌పై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంలో అధికార సిబ్బందికి ప్రమేయం లేకపోవడంతో అధికారులు వేగంగా స్పందించినట్లు అర్థమవుతుంది.
- తాజాగా విద్యార్థుల పరీక్షా ఫలితాల విడుదలలో తప్పులు దొర్లాయి. చాలా మంది విద్యార్థుల మార్కుల జాబితా తారుమారైంది. దీని కారణంగా కొంత మంది పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. విద్యార్థులు ఆందోళన చేయడంతో విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ ఏం చేస్తుందో వేచి చూడాలి.

ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు

గతంలో ఏం జరిగిందో తెలియదు. ఇప్పుడు మాత్రం విచారించి ఎవరైన నిర్లక్ష్యంగా వ్యవహారించినా, తప్పులు చేస్తే చర్యలు తీసుకుంటాం. పరీక్షా ఫలితాల విడుదలలో చోటుచేసుకున్న తప్పులపై నియమించిన కమిటీ విచారణ చేపట్టింది. పూర్తి వివరాలతో నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాం.

(మురళీదర్శన్, ఓఎస్‌డీ)



ఆర్‌జేయూకేటీ బాసర క్యాంపస్

ఘనంగా ముజ్గి మల్లన్న జాతర



పూజల అనంతరం మల్లన్నస్వామి మూలవిరాట్

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముజ్గి మల్లన్న జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామతో పాటు నిర్మల్, వెంకటాపూర్, కొండాపూర్, చిట్యాల, సోన్, కడ్తాల్, లోకల్ వెల్మల్, సిద్దులకుంట, తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు సల్ల కుండలతో తరలివచ్చారు. బుధవారం సాయంత్రం పెద్దసంఖ్యలో భక్తులు చల్లకుండలతో ఆలయానికి నడిచి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

స్వామివారిని దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు

స్వామివారిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు జరిపారు. స్వామివారి కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, రత్నాపూర్ కాండ్లి మాజీ సర్పంచ్ కే. రాంరెడ్డి, రవి, యువజన కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆలయ 35 వార్షికోత్సవం వేడుకలు బుధవారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవార్‌పేట్ హనుమాన్ ఆలయం నుంచి బాజభజంత్రీల నడుమ మహిళలు మంగళహారతులతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించి, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వంచారు. పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు ఆలయ పూజారి ఆధ్వర్యంలో మనుమయ సంఘం, పట్టణ కర్ర పారిశ్రామిక సంగం సభ్యులు చేతులతో వలచిన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మనుమయ సంఘం, పట్టణ మనుమయ సంఘం, కమ్మరి సంఘం, పట్టణ కర్ర పారిశ్రామిక సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన ఆహ్వానపత్రిక అందజేత



ఆహ్వానపత్రిక అందజేస్తున్న సభ్యులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సారంగాపూర్ మండలం వైకుంఠాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీప్రభుస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవ ఆహ్వానపత్రిక డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావుకు బుధవారం కమిటీ సభ్యులు అందజేశారు. ఈ నెల 15 శివాలయం, లక్ష్మీనరసింహస్వామి, హనుమాన్ సహిత నవగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవంలో పాల్గొనాలని కోరారు. దేవరకోట ఆలయ చైర్మన్ కొండా శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

నిర్మల్ డిపోలో డ్రైవింగ్ శిక్షణ



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నెంబర్ కలిగిన అభ్యర్థుల కొరకు నిర్మల్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. శిక్షణ 30 రోజులు ఉంటుందని, నిపుణులైన అనుభవజ్ఞులైన డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌లచే ఆర్టీసీ బస్సుచే ప్రాక్టికల్ బస్సు నడపటం, థియరీ క్లాసులు శిక్షణ అనంతరం టెస్ట్ పెట్టి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఈ సర్టిఫికెట్ ఆర్టీవో దగ్గర లైసెన్స్ పొందేటప్పుడు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ శిక్షణ పొందడానికి ఆర్టీసీకి రూ. 15,600లు కట్టవలసి వస్తుంది. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు రూ. 10,000లు కడితే సరిపోతుందని డిపోమేనేజర్ తెలిపారు. మరిన్ని వివరాలకు ఎస్. రాజన్న, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ 7382842443ను సంప్రదించాలని డిపో మేనేజర్ తెలిపారు.

నిల్వ చేసిన ఇసుక స్వాధీనం



ఇసుకను స్వాధీనం చేసుకున్న దృశ్యం

ముథోల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని సాయి మాధవ్ నగర్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను బుధవారం రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సుమారు 3 టిప్పర్ల ఇసుక అక్రమంగా డంపు చేసి ఉండటంతో స్వాధీనపరుచుకున్నట్లు ఆర్ఐ నారాయణ పటేల్ తెలిపారు. అక్రమంగా డంపు చేసిన ఇసుకకు త్వరలో వేలం పాట వేయనున్నట్లు ఆర్ఐ నారాయణ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు



లోకేశ్వరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాత్‌గాం గ్రామ సమీపంలో బుధ వారం సాత్‌గాం గ్రామం నుంచి లోకేశ్వరం వైపుకు వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పడాల రామదాసు అనే వ్యక్తి ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. లోకేశ్వరం ఎస్సై జి. అశోక్ సిబ్బం దితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ ట్రాక్టర్‌ను ఆపి ట్రాక్టర్ ఇసుక రాయల్టీ రసీదును ఇవ్వమని అడిగారు. అతని వద్ద ఎలాంటి రాయల్టీ పత్రాలు లేనందున ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లోకేశ్వరం ఎస్సై తెలిపారు.

జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలి : డీఆర్డీవో విజయలక్ష్మి



లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి బుధవారం అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఐకేపీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. ఫామ్ పాండ్లు, నాడేపు కంపోస్టులు ఏర్పాటు చేయాలని రైతుల చేత పండ్ల తోటలు పెట్టించాలని కోరారు. అనంతరం పొట్టపల్లి నర్సరీని పరిశీలించి నర్సరీలో పూలు, పండ్లతో పాటు డ్రాగన్ ఫ్రూట్స్‌ను పెంచడంచాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఐకేపీ సిబ్బంది, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ జిల్లా కార్యదర్శి పోచయ్య

ఖానాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో ఆర్టిజెన్లు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ కృషిచేస్తుందని జిల్లా కార్యదర్శి పోచయ్య అన్నారు.బుధవారం టీఈఈ 1104 యూనియన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖానాపూర్‌లో ఆ యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నాయకులకు మిఠాయిలను పంపిణీ చేశారు. 75 ఏళ్లుగా తమ యూనియన్ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేసిందని రాబోయే రోజుల్లోను అదే పాత్ర పోషిస్తుందని పోచయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో టీఈఈ 1104 యూనియన్ డివిజన్ కార్యదర్శి వెంకట రమణ, రాష్ట్ర నాయకులు కొరిపెల్లి శ్రీనివాస్, రాజేశ్వరరావు, ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ నాలుగు మండలాల విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న డివిజన్ కార్యదర్శి వెంకటరమణ

ప్రేమోన్మాదికి జీవితఖైదు

- అలేఖ్య హత్య కేసులో నిందితుడు శ్రీకాంత్‌కి జీవితకాల కఠిన కారాగార శిక్ష
- తీర్పు వెలువరించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి



గత ఏడాది ఫిబ్రవరి 8న రక్తపు మడుగులో పడి ఉన్న తన ఆడపడుచు మృతదేహం వద్ద తీవ్ర గాయాలతో రోదిస్తున్న జయశీల (ఫైల్)



అలేఖ్య (ఫైల్ ఫొటో)

ఖానాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏడాది క్రితం రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన అలేఖ్య హత్య కేసులో ప్రేమోన్మాది జూకింది శ్రీకాంత్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 1000 జరిమానాను విధిస్తూ నిర్మల్ కోర్టు తీర్పును వెల్లడించింది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ సీఐ సైదారావు తెలిపిన కథనం ప్రకారం... ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన షట్పెల్లి అలేఖ్య అనే యువతిని అదే కాలనీకి చెందిన జూకింది శ్రీకాంత్ ప్రేమ పేరిట వెంబడించాడు. పెళ్లి చేసుకోమని వేధించాడు. కాగా సదరు యువతి అలేఖ్య తిరస్కరించడంతో ఆమెపై శ్రీకాంత్ ద్వేషాన్ని పెంచుకున్నాడు. ఆమెకు వచ్చిన పెళ్లి సంబంధాన్ని సైతం చెడగొట్టాడు. దీంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేసి మరోసారి అలేఖ్య జోలికి వెళ్ళవద్దని శ్రీకాంత్‌ను హెచ్చరించారు. దీంతో అలేఖ్య జోలికి వెళ్ళనని తెలిపిన శ్రీకాంత్ ఆ తర్వాత ప్రేమోన్మాదిగా మారాడు. అలేఖ్యకు కుటుంబ సభ్యులు ఎలాగైనా పెళ్లి చేస్తారని భావించిన శ్రీకాంత్ గత ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన షెట్పెల్లి అలేఖ్య తన వదిన జయశీల, మూడేళ్ల అల్లుడు రియాన్స్‌తో కలిసి టైలరింగ్ నేర్చుకునేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా శివాజీనగర్ వద్ద అప్పటికే పక్కా ప్రణాళికతో వేచి చూస్తున్న శ్రీకాంత్ కొబ్బరి బోండాలు నరికే కత్తితో దాడి చేసి విచక్షణారహితంగా నరికాడు. శ్రీకాంత్ అలేఖ్యపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేస్తుండగా అడ్డుగా వెళ్లిన ఆమె వదిన జయశీలను సైతం శ్రీకాంత్ విచక్షణా రహితంగా నరికాడు. ఈ దాడిలో అలేఖ్య అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీకాంత్ చేతిలో జయశీల, ఆమె కుమారుడు రియాన్స్‌కు సైతం తలపై కత్తి తగిలి తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి సీఐ మోహన్, ఎస్సై లింబాద్రిలు కేసు నమోదు చేయగా ప్రస్తుత సీఐ సైదారావు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. దీంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 27 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసులో సాక్షాధారాలను పరిశీలించిన తర్వాత బుధవారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏ. కరుణాకర్ తీర్పును వెల్లడించారు. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడైన శ్రీకాంత్‌కు ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం జీవితకాలం కఠిన కారాగారశిక్షతో పాటు 1000 జరిమానాను విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు ఖానాపూర్ సీఐ సైదారావు తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన హత్య జరగగా సరిగ్గా ఏడాది నాలుగు రోజులకు హత్య కేసులో నిందితుడికి జీవితకాల కఠిన కారాగార శిక్ష పడడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం గెలిచిందంటూ సోషల్ మీడియా వేదికగా మెసేజ్‌లను ట్రోలింగ్ చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన నాలుగో తరగతి ఉద్యోగులు



జిల్లా కలెక్టర్‌ను కలిసిన నాలుగో తరగతి ఉద్యోగులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎన్నుకోబడిన తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సభ్యులు కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బి.రవి, కార్యదర్శి గణేష్, సభ్యులు లక్ష్మణ్, రవి, గంగన్న, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి : మున్సిపల్ కమిషనర్

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను చెల్లించని యజమానుల ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టణ పురపాలక సంఘ పరిధిలో అనుమతి లేకుండా ఎటువంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని, ఒకవేళ ఏర్పాటు చేసిన అట్టి వారిపై జరిమానా విధించడంతో పాటు తెలంగాణ మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

గిడుగు జాతీయ పురస్కారానికి తోడిశెట్టి ఎంపిక

సోన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గిడుగు రామ్మూర్తి పంతులు జాతీయ పురస్కారానికి నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, జాఫ్రాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోడిశెట్టి పరమేశ్వర్ ఎంపిక య్యారు. తెలుగు భాష పరిరక్షణ కొరకు నిర్మల్ భారతి సాహితీ కళా క్షేత్రాన్ని స్థాపించి సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు, ఆకాశ వాణిలో ప్రసారమైన ప్రసగాలకు గాను ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు పరమేశ్వర్ తెలిపారు.

బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో వైభవి ప్రతిభ

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పట్టణంలోని రవి ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 8 నుండి 15 తేదీ వరకు నిర్వహించిన పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో రవి ఉన్నత పాఠశాలలో చదువుతున్న అనుముల వైభవి అండర్-13 విభాగంలో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.